క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: స్థానిక మూలవీధిలో కొలువుదీరిన పొలమూరు గ్రామదేవత వనుములమ్మవారి జాతర, తీర్థాన్ని పురస్కరించుకుని ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. పొలమూరు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా అమ్మవారికి రెండు రోజుల పాటు జాతర, తీర్థం నిర్వహించటం పరిపాటి.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 18 రోజులుగా జరుగుతున్న సురేంద్ర మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. హోం గార్డుగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన తమ మిత్రుడు సురేంద్ర స్మృతిగా అతని మిత్రులు బషీర్, ఎం.సతీష్, ఎం.శివనాగు, కుమార్ ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలలో విన్నర్‌గా నిలిచిన రాయవరం జట్టుకు ట్రోఫీతోపాటు రూ.30 వేల నగదును అందజేశారు. తరువాత స్థానాలలో నిలిచిన జగ్గంపేట జట్టుకు రూ.15 వేలు, రాజానగరం జట్టుకు రూ.8 వేలు, గాడాల జట్టుకు రూ.4 వేలు నగదుతో పాటు బహుమతులను రియల్ ఎస్టేట్ వ్యాపారి దూలం గోపి అందజేశారు.

ఘనంగా మాచరమ్మ తీర్థం

పెదపూడి: మండల కేంద్రం పెదపూడిలో ప్రసిద్ధి చెందిన మాచరమ్మ వారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాచరమ్మ తీర్థానికి మండల నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు

అనపర్తి సీఐ శివగణేష్ హెచ్చరిక



బలభద్రపురంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివగణేష్

బిక్కవోలు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల రోజున ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అనపర్తి సీఐ శివగణేష్ హెచ్చరించారు. ఆదివారం బలభద్రపురం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా పోలీసులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 26 మోటార్ బైక్‌లను సీజ్ చేశారు. దీంతో పాటు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 10 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అనపర్తి సీఐ శివగణేష్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే వరకూ గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ కొనసాగుతుందన్నారు. ఎన్నికల ఫలితాల విడుదల సందర్భంగా ప్రతిఒక్కరూ శాంతియుత వాతావరణానికి సహకరించాలన్నారు. ఎన్నికల తుది ఫలితాలు వచ్చే వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళికి అనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫలితాల అనంతరం బాణసంచా కాల్చు, ఊరేగింపులు వంటివి నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఎన్నికల నిబంధనలను ఏ ఒక్కరు అతిక్రమించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తమ సంబంధం లేని బయటి వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి.బుజ్జిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిల్లంకలో కార్డన్ అండ్ సెర్చ్



బొబ్బిల్లంకలో రికార్డులు లేని మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలలో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించామని నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం బొబ్బిల్లంకలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసులు, కోరుకొండ సీఐ నాగ మురళీ పర్యవేక్షణలో సీతానగరం, కోరుకొండ ఎస్సైలు టి.రామకృష్ణ, డి.ఆనంద్‌కుమార్ తమ సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న ఇళ్లకు వెళ్లి సెర్చ్ చేశారు. ఇళ్లల్లో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా, మందుగుండు సామగ్రి వంటివి నిల్వ ఉన్నాయేమోనని పరిశీలించారు. ఏ విధమైన రికార్డులు లేని 10 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సారా నిల్వలు, బాణసంచా నిల్వల ఉన్నాయోమోనని గాలించామని, అటువంటివి ఏమీ లేవన్నారు. వచ్చే నెల 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఊరేగింపులు, సభలు, సమావేశాలు వంటివి ఏమి నిర్వహించరాదన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ నిర్వహించామని నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసులు వివరించారు. ఏఎస్సై సమర్పణరావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ రాజా రమేష్, అశోక్, వినోద్, మహిళా కానిస్టేబుల్స్ చిన్ని, మహాలక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమానికి హాజరైన 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మధురపూడి: 1994–95 సంవత్సరం కోరుకొండ ప్రభుత్వోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు గత తీపి జ్ఞాపకాలను ఆదివారం నెమరువేసుకున్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి నాగసాయి ఫంక్షన్ హాలులో ఆదివారం వారి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మండల కేంద్రమైన కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్‌లో 1994 –95 సంవత్సరంలో వీరంతా 10వ తరగతి, 1996–97 సంవత్సరంలో రాజుబాబు జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వీరంతా చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తెలుగుమాస్టారి బోధనలు, ఇంగ్లిషు హోమ్‌వర్క్‌లో వచ్చిన పొరపాట్లకు గాను మాస్టారిచ్చిన పనిష్‌మెంట్ గురించి మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు సైతం పాల్గొన్నారు. అలనాటి విద్యార్థుల బ్యాచ్‌లో ఢిల్లీ ఎయిమ్స్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కోటికేశవరం గ్రామానికి చెందిన బర్రే విజయప్రసాద్ సమావేశానికి హాజరయ్యారు. కాగా ఇదే బ్యాచ్‌కు చెందిన రాజానగరం మండలం నందరాడకు చెందిన రత్నం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నికల కారణంగా ఆయన హాజరుకాలేదు. ఈ బ్యాచ్‌లోని చాలామంది వ్యాపారస్తులు, రెవెన్యూ, వివిధ శాఖల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారు. వీరంతా నాటి సంగతులను గుర్తుచేయడంతో పాటు, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పద్యాలు, పాటల ఆలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బొండాడ మధు, నాగ శేషగిరి, సత్తార్, మర్ల సీతారమశాస్త్రి, నక్కా ఆనంద్, పైడిమళ్ల నరసింహారావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ఉపాధ్యాయ దంపతులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేట లోగల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శారద కాన్వెంట్‌లో చదువుకున్న 1985 – 86 అయిదో తరగతి విద్యార్థులు ద్వారకామయి ఫంక్షన్ హాల్‌లో ఉత్సాహంగా గడిపారు. పలు ఆటపాటలతో గడిపి, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి టీచర్ ముక్కు రాజేశ్వరి, దేవదత్తం దంపతులను సత్కరించారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం సాగింది.

వైభవంగా తీర్థం

రాజానగరం: గ్రామ దేవత ముత్యాలమ్మ వారి జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం రాత్రి గ్రామంలో జాతర జరిగింది. ఆదివారం తీర్థం సందర్భంగా గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు జగన్మాతను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల వీఆర్వో గోసాల చిన్నా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలడుగుల రాముపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ముగ్గళ్ళ ర్యాంపు నుంచి ఇసుక తరలించకుండా వీఆర్వో చిన్నా, వీఆర్ఏలు మద్దాల దుర్గారావు, రాజేంద్రప్రసాద్ శనివారం విధులు నిర్వహించారు. అర్ధరాత్రి 2 గంటలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుని సీతానగరం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా పాలడుగుల రాము అడ్డుకున్నాడు. కులం పేరుతో దూషించి, వీఆర్ఏను నిర్బంధించి ట్రాక్టర్‌ను అక్కడ నుంచి తీసుకువెళ్లిపోయాడు. వీఆర్వో చిన్నా ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాముపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చిత్రలేఖనంతో సృజనాత్మక శక్తి

రంగంపేట: చిత్రలేఖనంతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందుతుందని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు ఆదివారం పంచతంత్ర నీతి కథలను బోధించారు. అనంతరం చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. విశ్రాంత ఇరిగేషన్ ఉద్యోగి పీవీ ప్రసాద్ విద్యార్థులుక తెలుగు శతక పద్యాలు నేర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

సూర్యదేవునికి విశేష పూజలు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ఉష, ఛాయ, పద్మ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో స్వామివారికి ఆదివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.